

'బీఆర్ ఏయూ' సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, జూన్ 29: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల ఫలితాలను శనివారం విడుదల చేసినట్టు డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. 'బీటెక్ 8వ సెమిస్టర్‌కు 198మంది హాజరుకాగా 196మంది ఉత్తీర్ణుల య్యారు. ఎల్ఎల్‌బీ (ఐదేళ్లు) 10వ సెమిస్టర్‌కు 18 మందికి 18 మంది, ఎల్ఎల్‌బీ (మూడేళ్లు) 111 మందికి 111 మంది ఉత్తీర్ణులయ్యారు. బీపీఈడీ మొదటి సెమిస్టర్‌కు 270 మందికి 250 మంది, డీపీఈడీ మొదటి సెమిస్టర్ 47 మందికి 46 మంది పాసయ్యారు. ఫలితాల వివరాలను జ్ఞానభూమి పోర్టల్, వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామ'ని డీన్ ఉదయభాస్కర్ వివరించారు.

ఇంటి వద్దకే పింఛన్లు

- రేపటి నుంచే ప్రారంభం
- పెంచిన మొత్తంతో కలిపి రూ.7వేలు చొప్పున..
- సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీకి ఏర్పాట్లు







(నరసన్నపేట)

సామాజిక పింఛన్‌దారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోనున్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని పెంచారు. జూలై 1న సచివాలయ ఉద్యోగుల ద్వారా నేరుగా ఇంటి వద్దకే లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, ఇతర లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు 3,19,147 మంది ఉన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళ, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, చెప్పులు కుట్టే కార్మికులు, పక్షవాత రోగులు, ప్రమాద బాధితులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్ జెండర్స్, మత్స్యకారులు, డయాలసిస్ రోగులతో పాటు 26 రకాల లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేస్తోంది. వీరందరికీ గత నెలలో వైసీపీ ప్రభుత్వం రూ.105 కోట్లు పంపిణీ చేసింది. సామాజిక పింఛన్‌దారుడికి ప్రతి నెలా రూ.3వేలు చొప్పున అందజేసింది. అయితే తాము అధికారంలోకి వస్తే పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతామని, ఏప్రిల్ నుంచే దీనిని వర్తింపజేసేలా చేస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు జూలై నుంచి సామాజిక పింఛన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచారు. దీంతోపాటు ఏప్రిల్, మే, జూన్‌కు సంబంధించి రూ.వెయ్యి చొప్పున మరో రూ.3వేలు అందజేయనున్నారు. అంటే ఈసారి మొత్తం రూ.7 వేలు పింఛన్‌ను అందుకోనున్నారు. అలాగే దివ్యాంగులు, కుష్ఠురోగులకు రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచారు. పక్షవాతంతో వీల్‌చైర్‌కు పరిమితమైన రోగులు, తీవ్ర ప్రమాదబాధితులు, తీవ్ర కండరాల బలహీనత రోగులకు గతంలో ఇచ్చే రూ.5వేలకు బదులుగా రూ.15వేలు ఇవ్వనున్నారు. పింఛన్ల పెంపు కారణంగా.. జిల్లాలో ఈసారి రూ.211.70 కోట్లు మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

ఇబ్బందుల్లేకుండా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో వార్డు, గ్రామ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేసేవారు. ఎన్నికల ముందు వలంటీర్లను ప్రైవేటు సైన్యంలా వైసీపీ ప్రభుత్వం ఉపయోగించుకుంది. దీంతో ఎలక్షన్ కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఎన్నికలు ముగిసే వరకు సంక్షేమ పథకాలు అమలులో వలంటీర్ల ప్రమేయం ఉండకూడదని ఆంక్షలు విధించింది. సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేపట్టాలని ఆదేశించింది. అయితే ఇదంతా టీడీపీ కుట్రేనని.. వలంటీర్లు లేకపోతే లబ్ధిదారులకు పింఛన్లు ఇవ్వలేమని వైసీపీ నాయకులు నానా హంగామా చేశారు. ఈక్రమంలో ఏప్రిల్ నెలలో పింఛన్ పొందేందుకు లబ్ధిదారులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. తర్వాత మే, జూన్ నెలల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదు జమ చేశారు. కాగా.. కేవైసీ కాకపోవడం, కొంతమంది బ్యాంకు ఖాతాల లావాదేవీలు నిలిచిపోవడంతో వాటిని రెన్యువల్ చేయించుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈసారి అటువంటి ఇబ్బందులేమీ లేకుండా ఉండేలా కొత్త ప్రభుత్వం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సచివాలయ సిబ్బందితో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకుని జూలై ఒకటో తేదీన ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతీ ఉద్యోగి 50 నుంచి 60 మంది పింఛన్‌దారులను ఓ క్లస్టర్‌గా ఏర్పాటు చేసి.. పింఛన్లు పంపిణీ చేయాలని స్పష్టం చేసింది. దీంతో తమకు పింఛన్ కష్టాలు తీరనున్నాయని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. పింఛన్ మొత్తం పెంపుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక కార్యాచరణ అమలు

- ఉదయం 6 గంటలకే పింఛన్ పంపిణీ: కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, జూన్ 29: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీకి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. శనివారం ఏపీ సచివాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్.. అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా చూడాలని ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. 'జూలై 1న ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలి. మొదటి రోజునే శతశాతం పంపిణీ చేయాలి. 50 మంది లబ్ధిదారులకు ఒక అధికారిని కేటాయించాం. బయోమెట్రిక్ విధానం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి రూ.7వేలను అందించి వారి నుంచి రశీదును పొందాలి. పాత పింఛను పుస్తకాలను వినియోగించరాదు. వాటిని వినియోగిస్తే సంబంధిత ఎంపీడీవోపై చర్యలు తీసుకుంటాం. పింఛన్‌తోపాటు సీఎం లేఖను కూడా లబ్ధిదారులకు అందజేయాలి. వెల్ఫేర్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రటరీలకు పింఛన్ పంపిణీపై అవగాహన కల్పించాలి. ఎటువంటి తప్పిదాలకు తావు లేకుండా వ్యవహరించాల'ని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, గ్రామీణాభి వృద్ధి పీడీ కిరణ్‌కుమార్, డీపీవో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంకు ప్రతినిధి శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

సురక్షితంగా ఈవీఎం యూనిట్స్

కలెక్టరేట్, జూన్ 29: సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన తరువాత ఈవీఎమ్ యూనిట్స్‌ను పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్‌రూమ్‌లలో సురక్షితంగా భద్రపరిచామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఆయా యూనిట్స్‌ను గోడౌన్‌కు తరలించామని తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్‌పై కదలిక

- నిర్మాణం పూర్తిచేస్తామని ప్రకటించిన మంత్రి అచ్చెన్న
- నిర్వాసిత కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ఆదేశాలు
- పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్న అధికారులు
- రైతుల్లో ఆనందం


నిలిచిన ఆఫ్‌షోర్ జలాశయం పనులు

(పలాస)

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణంపై కదలిక వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన ఈ పనులను మళ్లీ పునఃప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రాష్ట్ర వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొన్నిరోజుల క్రితం వంశధార కాలువ పనులు పర్యవేక్షించేందుకు పలాస వచ్చారు. ఈ సందర్భంగా ఆఫ్‌షోర్ రిజర్వాయర్ విషయాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వంశధార ఈఈగా బాధ్యతలు తీసుకున్న శేఖర్‌బాబును వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే పనులు ప్రారంభించాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. రిజర్వాయర్ నిర్వాసితుల కాలనీ కూడా పూర్తి చేయాలని ఆదేశించడంతో ఈ పనులపై అధికారులు దృష్టి పెట్టారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈసారైనా పూర్తయ్యేనా?

జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మెళియాపుట్టి, నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందజేయాలనే ఉద్దేశంతో అప్పటి ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను ప్రతిపాదించారు. ఈ మేరకు 2008 ఏప్రిల్ 4న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ పనులకు శంకుస్థాపన చేశారు. మెళియాపుట్టి, చాపర సమీపంలో మహేంద్రతనయపై ఫ్లడ్‌ఫ్లో కెనాల్ ఏర్పాటు చేసి సాగునీటిని కాలువల ద్వారా రేగులపాడు రిజర్వాయర్‌కు తరలించాలని నిర్ణయించారు. రిజర్వాయర్ నుంచి వివిధ ప్రాంతాలకు సాగునీటిని సరఫరా చేయాలని భావించారు. ఈ మేరకు పనులు చేపట్టేందుకు రూ.123.5 కోట్లు కేటాయించారు. కానీ, 16 ఏళ్లు అవుతున్నా పనులు మాత్రం పూర్తికావడం లేదు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా ఇదే పరిస్థితి. అంచనా వ్యయం పెరుగుతూనే ఉండగా.. పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే మెళియాపుట్టి, నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల పరిధిలో 25వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీకి తాగునీటి కష్టాలు తీరనున్నాయి.

- 2014 సంవత్సరంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి మాజీమంత్రి గౌతు శ్యామసుందర శివాజీ... రిజర్వాయర్ పూర్తి చేయాలని కోరుతూ గెడ్డం దీక్ష చేశారు. దీంతో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు స్పందించి రూ.800 కోట్లు విడుదల చేసి టెండర్లు పిలిచారు. కొంతమేర పనులు చేపట్టారు.
- 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పనులకు అతీగతి లేకుండా పోయింది. నిధులు మంజూరు చేయక రిజర్వాయర్ పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. గట్టు పనులు కేవలం 20 శాతం అయ్యాయి. భూ సేకరణ ప్రక్రియ పూర్తయింది. మదుములు(స్లూయిస్), పరుపు (సర్‌ప్లస్ వీయర్) పనులు ఇంకా ప్రారంభం కాలేదు. దిగువ కాలువ పనులు, పిల్ల కాలువల పనులు కూడా ప్రారంభించలేదు. ప్రస్తుతం ఈ పనులకు సంబంధించి అంచనా వ్యయం రూ.వెయ్యి కోట్లకు పెరిగింది. దీంతో అన్ని నిధులు విడుదల చేస్తారా? లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.
- ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి అచ్చెన్నాయుడు ఈ ప్రాంతంలో పర్యటిస్తూ ఆఫ్‌షోర్ తామే పూర్తి చేస్తామని ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. రానున్న ఐదేళ్లలో ఆఫ్‌షోర్ పూర్తవుతుందన్న నమ్మకంతో ఉన్నారు. దీంతో పాటు పలాస, టెక్కలిపట్నం ప్రాంతాల్లో సగంలో ఆగిపోయిన నిర్వాసితుల కాలనీ కూడా పూర్తి చేయడానికి ప్రభుత్వం సంకల్పించడంతో నిర్వాసితులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.


పలాస వద్ద కనీస సౌకర్యాలు లేని రిజర్వాయరు నిర్వాసితుల కాలనీ

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్

ఎచ్చెర్ల, జూన్ 29: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఐటీఐ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో తమ వివరాలను జూలై 24లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఏ ఐటీఐలో చేరాలనుకుంటున్నారో.. ఆ ఐటీఐకు ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫారంతోపాటు పదోతరగతి, ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లను సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో జూలై 25లోగా పరిశీలన చేయించుకోవాలన్నారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ఐటీఐలోనే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. కౌన్సెలింగ్ తేదీ వివరాలను అభ్యర్థుల మొబైల్‌కు సమాచారం అందిస్తామన్నారు.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు నోటిఫికేషన్

- రేపటి నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

గుజరాతీపేట, జూన్ 29: ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించి శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. జూలై 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని సాంకేతిక విద్యాశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. 'జూలై ఒకటి నుంచి ఏడో తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. జూలై 4 నుంచి 10వ తేదీ వరకు సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. అదే నెల 8 నుంచి 12వ తేదీ వరకు వరకు ఆప్షన్ల ఎంపిక పూర్తిచేయాలి. 13న మార్పులకు అవకాశం కల్పిస్తారు. 16న సీట్లు కేటాయించనున్నట్టు నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ఈ మేరకు అర్హులైన విద్యార్థులంతా సిద్ధమవుతున్నారు.


మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

పారిశ్రామికవాడలో.. అగ్ని ప్రమాదం

- సరాక పరిశ్రమలో చెలరేగిన మంటలు
- అప్రమత్తతతో తప్పిన ముప్పు

రణస్థలం, జూన్ 29: పైడిభీమవరం పారిశ్రామికవాడలో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక సరాక పరిశ్రమలో ఉత్పత్తికి సంబంధించి 'ప్రొడక్షన్-బీ'లో టోలిన్ సాల్వెంట్ పౌడర్ అన్‌లోడ్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగతో.. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో అక్కడ ఉన్న సిబ్బంది భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. కొంతమంది కార్మికులు అప్రమత్తమై మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అక్కడ ఉన్న ప్లాస్టిక్ రేకొషెడ్లకు మంటలు వ్యాపించడంతో అవి దగ్ధమయ్యాయి. సిస్కో రక్షణ సిబ్బంది, రణస్థలం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు కోటి రూపాయల వరకూ నష్టం వాటిల్లినట్లు అధికారుల అంచనా. కాగా.. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో యాజమాన్యంతోపాటు కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పరిశ్రమ వద్దకు చేరుకుని.. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలు, కార్మికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని యాజమాన్యానికి సూచించారు.


పరిశ్రమలో వ్యాపిస్తున్న దట్టమైన పొగ

జాతీయ లోక్‌అదాలత్‌లో 1,281 కేసులు పరిష్కారం


రాజీ కేసు పత్రాన్ని అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

గుజరాతీపేట, జూన్ 29: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లాలోని వేర్వేరు కోర్టులకు సంబంధించి న్యాయాధికారులు 1,281 కేసులు రాజీ చేసి పరిష్కరించారు. శనివారం జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి అధికంగా ఇరు పక్షాలు రాజీకి వచ్చాయి. 143 సివిల్ కేసులు, 1,061 క్రిమినల్ కేసులు రాజీ అయ్యాయి. ప్రీలిటికేషన్‌కు సంబంధించి 77 రాజీ అయ్యాయి. శ్రీకాకుళంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా, న్యాయాధికారులు పి.భాస్కర రావు, మూడవ అదనపు జిల్లా న్యాయాధికారి కె.వి.హిమబిందు, ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు, సివిల్ న్యాయాధికారి శారదాంబ, సమోహిదిన్, జామరూత్ బేగం కమలుదీన్, డి.శ్రీభరణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ

'మత్తు' నుంచి యువతను కాపాడాలి

- అఖిల భారత యువజన సమాఖ్య

అరసవల్లి, జూన్ 29: జిల్లాలో జరుగుతున్న మాదకద్రవ్యాల వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని, యువతను మత్తు పదార్థాల బారి నుంచి కాపాడాలని అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం స్థానిక రామలక్ష్మణ కూడలి వద్ద విద్యార్థులతో మానవహారం చేపట్టి, అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత, విద్యార్థులను మత్తు పదార్థాల నుంచి విముక్తి కల్పించాలన్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా గంజాయి వ్యాపారం పెద్దఎత్తున జరుగుతోందని తెలిపారు. ఉన్నతాధికారులు, పోలీసు వ్యవస్థ ఏం చేస్తోందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, కళాశాలల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలను కలిపి విద్యార్థులు జీవితాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై యువత, విద్యార్థులకు మరిన్ని అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సాంబశివరాజు, కిశోర్ పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

అగ్రి డిప్లొమాలు

ఎన్‌జీ రంగా వర్సిటీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు

- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్/టీఓఎస్ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** angrau.ac.in



డా.వైఎస్సార్ హెచ్‌యూ

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి. వీటిలో 75 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల వారికి కేటాయించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.

డిప్లొమా ఇన్ హార్టికల్చర్ సీట్ల వివరాలు

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎన్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎన్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-నోవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

అర్హత: బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఓఎస్ఎస్/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు, ఇంటర్ మధ్యలో ఆపేసిన/ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు, ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 6
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎఫ్‌సీఆర్ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఆర్ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు ఆయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంగ్లీష్‌లో 160 గంటల ప్రొఫిషియెన్సీ కోర్సును నిర్వహిస్తోంది. అభ్యర్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ ఆగస్టులో ప్రారంభమౌతుంది.



కోర్సు వివరాలు

- ఇందులో బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్ లెవెల్స్ ఉంటాయి. ప్లేస్‌మెంట్ టెస్ట్ ద్వారా లెవెల్ అడ్మిషన్ ఉంటుంది. కోర్సు వ్యవధి నాలుగు నెలలు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు నిర్వహిస్తారు. తరగతికి 30 నుంచి 35 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- కోర్సులో భాగంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్, గ్రామర్, ఒకాబులరీ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వారానికి ఒకసారి ప్రొనౌన్సియేషన్ ప్రాక్టీస్ ఉంటుంది. రీసెర్చ్ స్కాలర్స్, టీచింగ్ అసిస్టెంట్లు క్లాస్‌రూం తరగతులు నిర్వహిస్తారు. వీటికి సంబంధించిన మెటీరియల్ ఫొటోకాపీ ఇస్తారు. డిజిటల్ ల్యాబ్స్ ఉంటాయి. అభ్యర్థుల నెలవారీ ప్రోగ్రెస్‌ను పరీక్షిస్తారు. కోర్సు చివరలో ఫైనల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైనవారికి మాత్రమే సర్టిఫికెట్‌లు ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంస్థ నిర్వహించే 40 గంటల ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులు వీసా, రెసిడెన్స్ పర్మిట్ కాపీలు సబ్మిట్ చేయాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** జూలై 1
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఉస్మానియా యూనివర్సిటీలో వర్క్‌షాప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(డీఈఈ)- వారం రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. దీని ప్రధానాంశం 'అప్లికేషన్స్ ఆఫ్ డిజిటల్ కంట్రోల్ ఇన్ పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్స్'. ఈ వర్క్‌షాప్‌ను ఆర్‌యూఎస్ఏ-2.0, వీఐ మైక్రో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు స్పాన్సర్ చేస్తున్నాయి. ఇందులో ఫండమెంటల్ అండ్ అడ్వాన్స్‌డ్ థియరిటికల్ కాన్సెప్ట్‌లు; మైక్రోకంట్రోలర్స్, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసర్స్, ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ యారేస్‌ల వినియోగం; ల్యాబొరేటరీ సెషన్స్ ఉంటాయి. సంబంధిత విభాగాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్స్, ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్, ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.2,500; ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులకు రూ.3,500; ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్‌కు రూ.4,500
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూన్ 30
- **వర్క్‌షాప్ వ్యవధి:** జూలై 8 నుంచి 13
- **వెబ్‌సైట్:** www.uceou.edu

హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్‌లో ఖాళీలు

జాబ్ కార్నర్

సికింద్రాబాద్‌లోని హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్...కాంట్రాక్ట్ ప్రాతిపదికన బీబీనగర్ ఎయిమ్స్(అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్‌లు), తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.

ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి

అసిస్టెంట్ ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా **ఇంటర్వ్యూ తేదీలు:** జూలై 4

వెబ్‌సైట్: www.lifecarehll.com/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/soMebZfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఫహాద్‌పై సుమోటో కేసు

మలయాళ నటుడు, నిర్మాత ఫహాద్ ఫాజిల్‌పై కేరళ మానవ హక్కుల సంఘం సుమోటో కేసు నమోదు చేసింది. దీనిక్కారణం ఆయన నిర్మిస్తున్న 'పింకేలీ' సినిమా షూటింగ్. అంగమలైలోని ఎర్నాకులం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం రాత్రంతా ఈ సినిమా కోసం షూటింగు చేయడంతో




అక్కడున్న రోగులంతా ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి లోపలికి ఎవరినీ అనుమతించకుండా అత్యవసర విభాగం అనుమతి తీసుకోకుండా షూటింగ్ చేశారనేది ఆరోపణ. దీనిపై ఎర్నాకులం జిల్లా వైద్యాధికారి బీనా కుమారి సీరియస్ అయ్యారు. ఏడు రోజుల్లో ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న కేరళ మానవ హక్కుల సంఘం నిర్మాత ఫహాద్‌పై కేసు నమోదు చేసింది.

'హరిహర వీరమల్లు' వచ్చేది ఎప్పుడంటే

పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహరవీరమల్లు' మీదే ఇప్పుడందరి దృష్టి ఉంది. అగ్ర నిర్మాత ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం చాలా కాలంగా నిర్మాణంలో ఉంది. ఈ సినిమా విడుదల ఎప్పుడా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హీరో పవన్‌కల్యాణ్ రాజకీయాలతో బిజీ కావడం వల్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసన సభకు జరిగిన ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ గెలిచి, ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి, బిజీగా ఉండడంతో ఆయన ఆర్టిస్టుగా తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టడానికి మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటువంటి నేపథ్యంలో 'హరిహర వీరమల్లు' చిత్రం గురించి అప్‌డేట్ ఇచ్చారు నిర్మాత ఎ.ఎం.రత్నం. 'సినిమాలో పవన్‌కల్యాణ్ వర్క్ దాదాపు పూర్తయింది. మరో 20-25 రోజులు ఆయన కేటాయిస్తే షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ప్రస్తుతం పవన్‌కు ఉన్న బిజీ షెడ్యూల్ ను దృష్టిలో పెట్టుకుని షూటింగ్ ప్లాన్ చేస్తాం. మా సినిమా స్ట్రీమింగ్ రైట్స్ అమెజాన్‌కు ఇచ్చాం. వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం అక్టోబరులో సినిమాను విడుదల చేయాలి. అయితే ఇంకాస్త సమయం కావాలని వాళ్లను అడుగుతాం. డిసెంబర్ నాటికి విడుదల చేయడానికి ప్రయత్నిస్తాం. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది' అని చెప్పారు. సినిమా ఆలస్యం అవుతున్న కారణంగా 'హరిహర వీరమల్లు' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న క్రిష్ తప్పుకోవడంతో జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు.



గతంతో ముడిపడిన కథ



విజయ్‌ఆంటోని నటిస్తున్న చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్‌బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. శనివారం సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న హీరో గతమేంటి అనే ఆలోచనను ప్రేక్షకుల్లో రేకెత్తించారు. ఇది హీరో గతంతో ముడిపడిన కథ అని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.



ప్రముఖ నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ త్వరలోనే ప్రియుడు నికోలయ్ సచ్‌దేవ్‌తో ఏడడుగులు వేయనున్నారు. ప్రస్తుతం ఆమె పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. సినీ, రాజకీయ ప్రముఖులను కలసి ఆహ్వాన పత్రికలు పంచుతున్నారు. శనివారం వరలక్ష్మి కుటుంబ సమేతంగా ప్రధాని మోదీని కలిశారు. తమ వివాహ కార్యక్రమానికి హాజరయ్యి ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసి, ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.

స్టార్‌డమ్ పేరుతో బందీ కాలేను


దక్షిణాదిన అగ్ర హీరోలందరి సరసన కథానాయికగా అలరించిన తమన్నా ఇప్పుడు ప్రత్యేక గీతాల్లోనూ ఆడి పాడుతున్నారు. అలాగే ఓటీటీలో వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. నెగెటివ్ పాత్రలకు సైతం సై అంటున్నారు. దీంతో హీరోయిన్‌గా స్టార్‌డమ్ తగ్గడంతోనే తమన్నా ఐటమ్ సాంగ్స్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే తమన్నా మాత్రం వాటిని కొట్టిపారేస్తున్నారు. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలు చేయడం తన వల్ల కాదన్నారు. అందుకే కొత్త తరహా పాత్రలు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. కరోనా తర్వాత ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పుకు అనుగుణంగా కథలు, పాత్రలు ఎంచుకుంటున్నానని తెలిపారు. "మేస్ట్రో' చిత్రంలో నెగెటివ్ రోల్ చేశాను. ఆ పాత్ర బాగా పండింది. ఆ తర్వాత అలాంటి అవకాశాలు మరిన్ని నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. కానీ వాటికి నో చెప్పాను. ఇప్పుడు నటిగా నాలోనూ పరిణతి వచ్చింది. స్టార్‌డమ్ పేరుతో బందీగా ఉండలేను. హీరోకు జోడీగా నటించడం అనేది నాకున్న ఎంపికల్లో ఒకటి మాత్రమే అని గుర్తుంచుకోవాలి. వెబ్ సిరీస్‌లు చేసినా, ప్రత్యేక గీతాల్లో నర్తించినా ప్రేక్షకులకు ఇంకా ఏదో కొత్తదనం అందించాలనేదే నా ప్రయత్నం' అని తమన్నా అన్నారు.



తమన్నా



'కూర్మావతారం' ఆధారంగా...



వరలక్ష్మీ శరత్‌కుమార్, సాయికుమార్, శివాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కూర్మనాయకి'. హర్షవర్ధన్ కడియాల దర్శకత్వంలో కె.విజితా రావు నిర్మిస్తున్నారు. శనివారం శివాజీ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేసింది. మహావిష్ణు అవతారాల్లోని 'కూర్మావతారం' ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలవుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: చోటా.కె.ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రామ్, సంగీతం: శేఖర్‌చంద్ర.



'జై బోలో తెలంగాణా, హితుడు' లాంటి పలు తెలుగు చిత్రాల్లో కథానాయికగా నటించిన మీరానందన్ మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. యూకేకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ శ్రీజును ఆమె పెళ్లాడారు. శనివారం గురువాయుర్‌లో వీరి వివాహం ఘనంగా జరిగింది. ఆ ఫొటోలను మీరానందన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ఆశా పాదాలు కడిగిన సోనూ నిగమ్



బాలీవుడ్ చిత్రసీమలో దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న మధుర గాయని ఆశా భోంస్లే. ఆ గానమాధుర్యానికి ఎన్నో పురస్కారాలు వశమయ్యాయి. ఆమె సంగీత ప్రయాణం 'స్వరస్వామిని ఆశ' పేరుతో పుస్తకరూపంలోకి వచ్చింది. ఇటీవలే ముంబైలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన జరిగింది. ప్రముఖ గాయకుడు సోనూ నిగమ్ ఆశా పాదాలను కడిగారు. ఆమె పట్ల తనకున్న ప్రేమ, గౌరవాలను అలా చాటుకున్నారు. 'ఆశాజీ నుంచి చాలా నేర్చుకున్నాను. అందుకే ఆమెకు ఈ విధంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని సోనూ నిగమ్ చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rRRLwqX లో చదవండి.

అచ్చెన్నకు అభినందన



అచ్చెన్నను అభినందిస్తున్న బెజ్జిపల్లి నాయకులు

నందిగాం: బెజ్జిపల్లి పంచాయతీ టీడీపీ నాయకులు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు శనివారం అభినందించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షులు పి.అజయ్‌కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.చంద్రశేఖర్, తెలుగుయువత అధ్యక్షులు టి.ఉమామహేష్ ఆధ్వర్యంలో అచ్చెన్నకు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టి.సింహాద్రినాయుడు, ఫాల్గుణరావు, ధనుంజయ, తదితరులు ఉన్నారు.

ఎంటీఎస్ అమలు చేయాలి

సంతబొమ్మాళి: మినియం టైంస్కేల్‌అమలు (ఎంటీఎస్) చేసి రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు శమళ్ళ కృష్ణారావు, అశోక్ కోరారు. ఈమేరకు శనివారం వ్యవసాయ,మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఏళ్లగా చాలీ చాలని జీతంతో పనిచేస్తున్నామని తెలిపారు.

మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

నందిగాం: నందిగాం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగులుసీట్లు భర్తీకి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 54మంది హాజరయ్యారు. ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు సంబంధించి 109 ఖాళీలు ఉండగా 90మంది దరఖాస్తు చేసుకోగా 54మంది మాత్రమే హాజరయ్యారు.

● **పాతపట్నం:** స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో మిగులుసీట్ల భర్తీకి శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు 37 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ వి.అర్చన తెలిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

జలుమూరు: మండలంలోని రావిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, పాఠ్యపుస్తకాలు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండ రామకృష్ణ, గొల్లంగి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పురుషోత్తంరావు పాల్గొన్నారు.

●**పలాస రూరల్:** మామిడిపల్లి, బొడ్డపాడు ప్రాథమికపాఠశాల విద్యార్థులకు శనివారం బ్యాగులు, కిట్లు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర డిల్లీరావు, బొడ్డపాడు,మామిడిపల్లికి చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

జలుమూరు: సైరిగాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ముద్దాడ శ్రీనివాసరావును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం పరామర్శించారు.శ్రీనివాసరావుకు ఇటీవల మోకాలు శస్త్ర చికిత్స జరిగింది. ఆయన వెంట టీడీపీ నాయకులు బగ్గు గోవిందరావు, కింజరాపు సత్యం, సనపల రమణ, బి.బాలకృష్ణ ఉన్నారు.

హామీలు అమలు చేసే ఎన్నికలకు వెళ్తాం

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన తర్వాతే వచ్చే ఎన్నికలకు వెళ్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. శనివారం చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మునిసిపల్ సమావేశం జరిగింది. వైసీపీ కౌన్సిలర్ గుజ్జు జోగారావు మాట్లాడుతూ కాశీబుగ్గ ఫ్లైఓవర్, కేటీరోడ్డు పనులు పూర్తిచేయాలని, పారిశుధ్య సమస్యలు పరిష్కరించడానికి చొరవతీసుకోవాలని కోరారు.దీంతో శిరీష మాట్లాడుత గతప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన ఆయన్ను ప్రశ్నించాల్సిందన్నారు.అబద్ధాలతోనే కాలం గడిపారే తప్పా ఒక్క అభివృద్ధిపని పూర్తిచేశారా అని ప్రశ్నించారు.టీడీపీ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ ప్రతిరోజూ ఎన్ని ట్యాంకుల నీటిని ప్రజలకు అందిస్తున్నారని ప్రశ్నించారు.కౌన్సిలర్ దువ్వాడశ్రీకాంత్ మూడు నెలల నీటిసరఫరాకు రూ.15 లక్షలు బిల్లులు పెట్టడంపై తమకు అనుమానాలు ఉన్నాయని తెలిపారుదీంతో కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అప్పటి మంత్రి అప్పలరాజు మార్చిలో నీటి సరఫరాకు నిధులిచ్చారని, వాటి వివరాలు పొందుపరిచామని, మునిసిపల్ బిల్లులో వాటిని పెట్టలేదని చెప్పారు. కౌన్సిలర్లు తంగుడు ఆశారాణి, డొక్కరి తులసి, జోగ త్రివేణి నీటి సమస్యను ప్రస్తావించారు. కాగా ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మునిసిపల్ ఎక్స్అఫీషియో సభ్యు రాలిహోదాలో తొలిసారిగా సమావేశానికి శిరీష వచ్చారు.ఆమెకు చైర్మన్ ఎదురుగా సాధారణ సభ్యుల స్థానంలో సీటు కేటాయించారు. గత పాలకవర్గాల సమయంలో చైర్మన్ పక్కనే ఎమ్మెల్యేకు సీటు కల్పించారు. అయితే ప్రస్తుత పాలకవర్గంలో ఆ సీటును కౌన్సిలర్ల సరసన చేర్చారు. దీంతో కౌన్సిలర్ల అభ్యంతరం లేవనెత్తడంతో చైర్మన్ బళ్ల గిరిబాబు సభ్యుల ఆమోదం కోరారు. అభ్యంతరం లేదని, చైర్మన్‌కు అధికారం తీసుకోవచ్చని చెప్పడంతో ఆ సీటు చైర్మన్ పక్కనే వేశారు. అయితే గతంలో మంత్రి హోదాలో ఉన్నా ఆ సీటును చైర్మన్ పక్కనే ఎందుకు వేయలే దని గుసగుసలు వినిపించాయి. దీనికి దువ్వాడ శ్రీకాంత్ వివరణ ఇస్తు మంత్రి హోదాలో ఏనాడు సమావేశానికి అప్పటి ఎమ్మెల్యే రాలేదని, అందుకే ఆ ప్రస్తావనే లేదన్నారు.



మాట్లాడుతున్న గౌతు శిరీష

వైసీపీ పాలకుల నిర్లక్ష్యం రైతులకు శాపం

వజ్రపుకొత్తూరు: వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్ల శివారుభూములకు వంశధార నీరందక రైతులకు శాపంగా మారిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. శనివారం పాతటెక్కలి పంచాయతీ లింగా లపాడు వద్ద వంశధార చానల్‌లో పూడికతీత పనులు ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు, మాజీ సర్పంచ్‌లు పి .రమణమూర్తి, అట్టాడ రఘు, గోవిందపాపారావు, సర్పం చ్ అఖిల్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలక గిరిబాబు, నారాయణస్వామి, అప్పారావు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల కొమరల్తాడ మాజీ సర్పంచ్ బత్సల రాజు మృతిచెందడంతో ఆ కుటుంబానికి శిరీష పరామర్శించారు.

●**హరిపురం:** మందస మండలంలో ఇటీవల మృతిచెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే గౌతు శిరీష పరామర్శించారు. పొత్తంగిలో కోన జగన్నాథం, సిరిపురంలో కంసు దమయంతి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బహడపల్లికి చెందిన సాలిన జగన్నాయకులను కలిశారు. ఆమె వెంట టీడీపీ మండలాధ్యక్షుడు బావన దుర్యోధన, జీకే నాయుడు, బమ్మిడి కర్రయ్య, లబ్బ రుద్రయ్య నవీన్ ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

పలాస: స్థానిక ఎర్రచెరువు వద్ద రూ.1.50 కోట్ల విలువైన భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని, దీన్ని మాజీ మంత్రి అప్పలరాజు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టాలని టీడీపీ పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, నాయకులు పైల చక్రధర్, జోగ మల్లి, డొక్కరి శంకర్, కెల్లి ఆనంద్, పిట్ట రవి, జగదీష్‌పండా, ధనరాజు కోరారు. శనివారం ఎర్రచెరువు వద్ద ఆక్రమించిన ప్రాంతంలో నిర్మాణాన్ని పరిశీలించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

ఎల్.ఎన్.పేట: వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్ కోరారు. శనివారం మండలంలోని బొర్రంపేట, చింతలబడవం జల్లో పారిశుధ్యపనులను పరిశీలించారు. ఆయనవెంట ఎంపీడీవో జి.గిరిబాల, ఈవోపీఆర్డీ ఐ. పద్మజ, కార్యదర్శి జి.మాధురి ఉన్నారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి

సంతొమ్మాళి: పంచాయతీల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి పీవీ శ్రీనివాసరావు కోరారు. శనివారం మండలంలోని తాళ్లవలసలో పారిశుధ్య పనులను పరిశీంచారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాసుందరి, మండల పంచాయతీ అధికారి గోపాలరావు,కార్యదర్శులు దుంప శ్రీనివాసరావు, జి.విజయకుమార్, శ్రీను రామదాసులు పాల్గొన్నారు.

4,552 మంది విద్యార్థులకు కిట్లు: ఎంఈవోలు

పోలాకి: మండలంలోని 4,552 మంది విద్యార్థులకు కిట్లు పంపిణీకి సిద్ధం చేస్తున్నామని ఎంఈవోలు శ్రీనివాసనాయక్, లింగరాజు తెలిపారు. శనివారం పోలాకిలో ఏర్పాటుచేసిన కార్య క్రమంలో మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు తొలుత సరఫరా చేశామని ప్రస్తుతం బూట్లు, సాక్సులు, ఇతర సామగ్రి పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. తలసముద్రం, వెదుళ్లవలసలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నట్టు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెలియజేశామని చెప్పారు.

శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

పాతపట్నం: ఎన్టీఆర్ భరోసాపింఛన్ల పంపిణీ ఒక్క రోజులో శతశాతం పూర్తి చేయాలని ఎంపీడీవో కె.రామకృష్ణ రాజు తెలిపారు. శనివారం పాతపట్నంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 10,031 మంది లబ్ధిదారులకు రూ.67511500 కార్యదర్శుల అకౌంట్‌లో జమచేసినట్లు తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి

ఎల్.ఎన్.పేట: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో-1 సీహెచ్ మణికుమార్ తెలిపారు.శనివారం మండలంలోని తాయిమాంబపురం ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ ప్రాథమికపాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈవో-2 కె. చంద్రమౌళి పాల్గొన్నారు.

గ్రామసభలు తప్పనిసరిగా నిర్వహించాలి

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో గ్రామసభలు తప్పనిసరిగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.వెంకటరావు తెలిపారు. శనివారం లక్ష్మీనర్సుపేటలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండలశాఖ ఆధ్వర్యంలో సభ్యతనమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఐక్యవేదిక అధ్యక్షుడు పి.రామకృష్ణ, రామశంకరరావు పాల్గొన్నారు.

స్వర్ణకారులకు స్థలం అప్పగించాలి

టెక్కలి: స్వర్ణకారుల సొసైటీ స్థలం స్వర్ణకారులకు అందజేయాలని ప్రజాసంఘాల నాయకులు నంబూరు షణ్ముఖరావు, బెలమర ప్రభాకరరావు, కోత ధర్మారావు కోరారు. శనివారం టెక్కలి సబ్‌కలెక్టర్‌కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఆ స్థలం జగద్ధాత్రి డిస్‌ప్లే గోల్డ్‌స్మిత్ ఆర్‌సీసీ సన్‌ప్రైప్స్ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా పరిశ్రమ మంజూరుచేసి స్వర్ణకారులను ఆదుకోవాలని కోరారు. ఆ స్వర్ణకారుల సొసైటీ స్థలాన్ని అన్యాక్రాంతంచేశారని, మంత్రి అచ్చెన్నాయుడు ఈ స్థలాన్ని స్వర్ణకారులకు అప్పగించాలని కోరారు. ఈ సమావేశంలో లక్కోజి కేశవరావు, కవి, శంకర్, శ్రీను, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

చాన్నాకొరడలో జలాభిషేకం

హిరమండలం: చాన్నాకొరడ ఉమారుద్ర కోటేశ్వరాలయంలో వర్షాలు కురవాలని శనివారం పండితుడు గోవింద శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వంశధార నదిలో జలాలు తీసుకువచ్చి జలాభిషేకం చేశారు.

● **సంతబొమ్మాళి:** సంతబొమ్మాళి గ్రామస్థులు ఉమా పాలేశ్వరాలయంలో శివునికి వర్షాలు సక్రమంగా కురవాలని పూజలు చేశారు.వేదపండితుల మంత్రోచ్చరణతో 1108 బిందెల జలాలతో శివునికి అభిషేకం నిర్వహించారు.

ఈ-కేవైసీ కోసం పడిగాపులు

టెక్కలి: టెక్కలిలోని ప్రభానంద ఇండేన్ గ్యాస్ గోదాము వద్ద పలువురు గ్యాస్ వినియోగదారులు శనివారం బారులుతీరారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తా మని హామీఇచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పలువురు గ్యాస్‌కార్యాయాలకు వెళ్లి ఈ-కేవైసీ చేయించే పనిలో నిమగ్నమయ్యారు. గ్యాస్ కార్యాలయాల వద్ద వినియోగదారులు పడిగాపులు కాస్తున్నారు.

సీఐఎస్‌ఎఫ్ జవాన్ మృతి

ఎల్.ఎన్.పేట: మండలంలోని ముంగెన్నపాడుకు చెందిన సీఐఎస్‌ఎఫ్ జవాన్ యారబాటి ప్రసాద్(35) శుక్రవారం మృతిచెందారు. కుటుంబసభ్యుల కథనం మేరకు.. చెన్నైలోని శివగంగా జిల్లాలోని సీఐఎస్‌ఎఫ్ ఫోర్త్ బెటాలియన్‌లో ప్రసాద్ ఎలకీషియన్‌గా పనిచేస్తున్నాడు.అనారోగ్యంతో ప్రసాద్ మృతి చెందడంతో మృతదేహాన్ని ఫోర్త్ బెటాలియన్‌కు చెందిన ఇద్దరు ఏఎస్‌ఐలు తమిళసెల్వ, ఉదయ్‌తోపాటు జవాన్లు మురళీమోహన్, ఎం.కుమార్, భీమేశ్వరరావు, సత్యనారాయణ గ్రామానికి శనివారం తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహం గ్రామానికి చేరుకోగానే కుటుంబ సభ్యులు రోదించారు. మృతదేహంపై పూలమాలలువేసి జవాన్లు నివాళులర్పించారు. అందరితో కలివిడిగా ఉండే ప్రసాద్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా ప్రసాద్‌కు తల్లిదండ్రులు భాస్కరరావు, పైడమ్మలతోపాటు భార్య సోనియా, ఇద్దరు పిల్లలు, దామిని(6), అనుష్క(4)ఉన్నారు.

ఖాళీది ఇవ్వండి.. నిండు సిలిండర్ ఇస్తాం

● ఉచిత గ్యాస్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో మోసం

టెక్కలి: ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వారు ఎంచుకున్న ఏదో ఓ గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. నేరుగా ఆ గ్రామంలో ఉన్న ఓ ఇంటికి వెళ్లి ఆ కుటుంబ యజమాని పేరు చెప్పి మీకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది, మీ దగ్గర ఉన్న ఖాళీ సిలిండర్ మాకు ఇవ్వండని కోరుతున్నారు. సదరు యజమాని ఖాళీ గ్యాస్ సిలిండర్ వారికి ఇవ్వగానే రోడ్డుపైన వ్యాన్‌లో నిండు గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని, ఈ ఖాళీ దాన్ని తీసుకువెళ్లి నిండు సిలిండర్ తీసుకువస్తామని అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై జారుకుంటున్నారు. ఎంతసేపటికీ రాకపోయే సరికి మోసపోయామని నిర్ధారించుకున్నారు.తాజాగా ఈ తరహా సంఘటన శుక్రవారం నర్సింగపల్లి పంచాయతీ కిట్టాలపాడులో జరిగింది. నందిగాం మండలంలోని రధజనబొడ్డపాడు పంచాయతీ బెల్లుకోల, టెక్కలి మండలం లింగాలవలస, హరిపురంలో కూడా ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.అయితే ఏ ఒక్క బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. కాగా పోలీసులు దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఆస్తి తగాదాలో మహిళకు గాయాలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని చినవంక పంచాయతీ గుల్లలపాడు గ్రామానికి చెందిన మహిళకు ఆస్తి తగాదాలో గాయాలయ్యాయి.గుల్లలపాడు గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. గుల్లలపాడుకు చెందిన వాసుదేవరావు మొదటి భార్య కుమార్తె మెళియాపుట్టి మండలంలోని గోకర్ణపురానికి చెందిన గుంట నీలమ్మకు 45 సెంట్లు వాటా 20 ఏళ్ల కిందట ఇచ్చారు. తమకు వచ్చిన వాటాను సాగుచేస్తు వస్తున్నారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్ పనులకు శుక్రవారం సిద్ధమవుతున్న సమయంలో నీలమ్మపై వాసుదేవు రెండో భార్య కుమారుడు, కుమార్తె దాడిచేసి గాయపరిచినట్లు నీలమ్మ పోలీసులకు ఫిర్యాదుచేసింది. గాయపడిన నీలమ్మను పలాస ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వజ్రపుకొత్తూరు పోలీసులు చెప్పారు.

నగదు చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలోని తర్లిపేట జాతీయ రహదారి వద్ద నగదు చోరీచేసిన కేసుకు సంబంధించి శనివారం ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ తెలిపారు. పలాసకు చెందిన ఇద్దరు జీడిపిక్కల వ్యాపారులు ఈనెల27న టిఫిన్ కోసం ఆగిన సమయంలో వ్యాన్ డ్రైవర్ పథకం ప్రకారం ద్విచక్రవాహనంపై వచ్చి రూ.18.50లక్షలతో ఉడాయించినట్లు చెప్పారు. ఈమేరకు వ్యాన్ డ్రైవర్ కె.జగదీశ్వరరావు, సప్ప సింహాచలం, శంకరరావులను అరెస్టుచేసినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో పది మందికి గాయాలు

టెక్కలి: టెక్కలి పంచాయతీలో వీధికుక్కలు దాడిలో పది మంది గాయపడ్డారు.ఆదివారం రాత్రి ఎన్టీఆర్‌కాలనీ, శంభానవీధి ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేశాయని పలువురు తెలిపారు.ఈ మేరకు పదిమందికి గాయపరచడంతో వారంతా జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

సమయపాలన పాటించాలి

మెళియాపుట్టి: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీవో విమలారాణి హెచ్చరించారు. శనివారం బందపల్లి, వెంకటపురం, రాజపురం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టండి

నందిగాం: రాష్ట్రంలో కూటమి ద్వారా వైసీపీ విముక్త ప్రభుత్వాన్ని సాధించుకున్నామని, పవన్‌కల్యాణ్ లక్ష్యం నెరవేరిందని జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ దానేటి శ్రీధర్ తెలిపారు. ఇకఅభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. శనివారంలో జనసేన ఆధ్వర్యంలో కూటమి విజయోత్సవ మహాసభ నిర్వహించారు.టీడీపీ మండలాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, జనసేన జిల్లా ప్రతినిధి కూరాకుల యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, టి.చిరంజీవి, ఎస్.జానకిరాం, కె.ప్రసాదరావు, ఎం.పద్మావతి, వై.కామరాజు, నాగరాజు, మదన్‌గౌడ్, ఉమామహేష్, పి.సోమేశ్వరరావు, టి.నర్సింహులు, మోహనరావు, ఎస్.షణ్ముఖరావు పాల్గొన్నారు.

కూటమితో వ్యవస్థలు బలోపేతం

హిరమండలం: కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలను బలోపేతం చేస్తామని జడ్పీటీసీ సభ్యుడు పొగిరి చిట్టిబాబుతెలిపారు. శనివారం సుభలయకాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీచేశారు.

బడిఈడు పిల్లలను గుర్తించాలి

జలుమూరు: ఇంటింటా సర్వే నిర్వహించి బడిఈడు పిల్లలను గుర్తించి సమీపంలో గల ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో బి.మాధవరావు కోరారు.శనివారం మండలం అల్లాడలో ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రసాదరావు పాల్గొన్నారు.

●**నరసన్నపేట:** ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసన స్థాయిలను మరింత పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు సూచించారు. కోమర్తి పాఠశాలలో నేడు బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●**సంతబొమ్మాళి:** దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్య క్రమంలో హెచ్‌ఎం కోత చైతన్య, ఉపాధ్యాయులు భాస్కరరావు, ఆదికేశవరెడ్డి,వీరభద్రరావు,లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

పాఠశాలకు విద్యార్థుల వితరణ

హరిపురం: మందస మండలం కొత్తపల్లి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థులు పైల కీర్తన,హారిక, తెప్ప వెన్నల గత ఏడాది ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. దీంతో వీరంతా కలిసి పాఠశాల అభివృద్ధి కోసం తమ కొచ్చే రూ.12 వేలులో రెండువేల చొప్పున ఆరువేలు హెచ్‌ఎం ఎస్.గణేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భీమారావు, లక్ష్మణరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో జలచౌర్యం

టెక్కలి: టెక్కలి ఎన్టీఆర్‌కాలనీలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిత్యం జలచౌర్యం జరుగుతోంది.పేదలకోసం కేటాయించిన కాలనీలో కొందరు పైఅంతస్థుల భవనాలు నిర్మించుకున్నారు. ఇక్కడ కాలనీలో సురక్షిత తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్లు ఏర్పాటుచేసి అక్కడ తాగునీటి కొళాయిలను సమకూర్చారు. అయితే పైఅంతస్తుల భవనాల్లో ఉంటున్న వారు కొళాయిల నీటిని చౌర్యం చేయడానికి చిన్న మోటార్లు ఏర్పాటుచేసుకొని అక్రమంగా తరలిస్తున్నారు. కొళాయి పాయింట్ల నుంచి కొందరు రాజకీయ పలుకుబడి ఉన్నవారు నీటిని తరలిస్తుండడంతో కాలనీలో ప్రజలకు అవస్థలుతప్పడంలేదు. కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగాఉన్న సమయంలో కొందరు జలచౌర్యం చేయడంపై నిరసన వ్యక్తమవు తోంది. కాగా కొళాయిల నుంచి నీటిని అక్రమంగా తరలించడం నా దృష్టికి రాలేదని, ఒకవేళ అలా కనిపిస్తే అక్కడ మోటార్లను సీజ్ చేస్తామని టెక్కలి పంచాయతీ కార్యదర్శి కూర్మారావు తెలిపారు.

లోక్‌అదాలత్‌లో 133 కేసులు పరిష్కారం

టెక్కలి: స్థానిక కోర్టు సముదాయం పరిధిలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 133 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు, మరో బెంచ్ జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వివేకానంద, రాజన్నాయుడు, దివాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● **కొత్తూరు:** స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.రాణి ఆధ్వర్యంలో 39 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాడరాజు, ఎం.అప్పారావు, ధర్మారావు, సుధాకర్ పాల్గొన్నారు.

●**నరసన్నపేట:** లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని స్థానిక సివిల్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ సూచించారు. శనివారం కోర్టు ప్రాంగణంలో లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, ఎస్ఐలు అశోక్‌బాబు, అప్పలనాయుడు,సెబీ ఎస్ఐ కావ్య, సీఐ సతీష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలాస: జంటపట్టణాల్లో పలుప్రాంతాల్లో ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం ఐదుగంటల వరకూ విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్ డీఈఈ జి.ప్రసాద్ తెలిపారు. 33/11 కేవీ లైన్ మరమ్మతుల దృష్ట్యా శ్రీనివాసనగర్, రోటరీనగర్, నెహ్రూనగర్, నిత్యానందనగర్, ఎంపీడీవో కార్యాలయంరోడ్డు, పండాక్వార్టర్స్, వెంకటేశ్వరకాలనీ, రైల్వే స్టేషన్‌రోడ్, పారిశ్రామికవాడ, మేథాస్కూల్ వెనుకభాగం, రెంటికోట, పద్మనాభపురం, కిడ్నీ ఆసుపత్రి వీధి, నెమలినారాయణపురంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

జలుమూరు: స్థానిక మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపిడీవో పి.ఉమామహేశ్వరరవు తెలిపారు. ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరుకానున్నారని పేర్కొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

మెళియాపుట్టి: ఒడియాలో పాఠ్యపుస్తాకాలు ముద్రించి బోధించాలని శనివారం చాపర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీబీఎస్ఈ పేరుతో ఒడియా విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో ఇంగ్లీష్‌లో బోధన వల్ల విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. గతప్రభుత్వం సీబీఎస్ఈ పేరుతో పాఠ్య పుస్తకాలు తెలుగు, ఇంగ్లీష్‌లో ముద్రించిందని చెప్పారు. ఒడియాలో బోధించడంతో పాటు పరీక్షలు సైతం ఒడియాలోనే నిర్వహించాలని కోరారు.

ఒడిశా

బాలలతో పనిచేయిస్తే నేరం: కలెక్టర్

పర్లాకిమిడి: బాలలతో పనిచేయిస్తే చట్టరీత్యా నేరమని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తెలిపారు.శనివారం పర్లాకిమిడిలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి గుణ నిధినాయక్, జిల్లా శిశు సంరక్షణ కేంద్రం అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి, భారతి బెహరా పాల్గొన్నారు.

ప్రధానకార్యదర్శిగా మనోజ్ ఆహుజా

పర్లాకిమిడి: ఒడిశా నూతన ప్రధాన కార్యదర్శిగా మనోజ్ ఆహుజా నియమితులయ్యారు. మనోజ్ అహుజా నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్ను జీఏ వెలువరించింది. ఆయన వ్యవసాయం రైతుల సాధికారత కేంద్ర కార్యదర్శిగా ఉన్నారు.

ఇదేనా వైసీపీ అభివృద్ధి

- శిలా ఫలకాలకే పరిమితం
- అంగుళం కూడా కదలని పనులు
- అధ్వానంగా ఏబీ రోడ్డు
- వాహనదారులకు తప్పని అవస్థలు



మండల కేంద్రంలో వేసిన శిలాఫలకం



అలికాం-బత్తిలి ప్రధాన రహదారి దుస్థితి

సరుబుజ్జిలి: అభివృద్ధి పేరుతో గత వైసీపీ ప్రభుత్వం చేసిన పనులన్నీ శిలాఫలకానికే పరిమితమయ్యాయి. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట అలికాం-బత్తిలి (ఏబీ) రహదారి అభివృద్ధి పనులకు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం వేసిన శిలాఫలకానికి ఎనిమిది నెలలు కావస్తున్నా నేటి పనులు ప్రారంభం కాలేదు. దీంతో గుంతల రహదారిలో ప్రయాణం చేస్తున్న వాహన చోదకులు మండిపడుతున్నారు. మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఉన్న సుమారు కిలోమీటరు దూరంలో ఏర్పడ్డ భారీ గుంతల్లో ప్రతిరోజూ వాహనాలు ఇరుక్కొని ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. సవలాపురం జంక్షన్ నుంచి బొర్రంపేట వరకు ఉన్న నాలుగు కిలోమీటర్లు ఏబీ రోడ్డు అభివృద్ధికి 2023 నవంబరు 1న రూ2.75 కోట్లతో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేశారు. నెలరోజుల్లోనే పనులు పూర్తి చేయిస్తామని ఆయన చెప్పి నేటికీ ఎనిమిది నెలలు కావస్తున్నా అంగులం కూడా పని జరగలేదు. దీంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఒడిశా నుంచి విశాఖ రవాణా చేస్తున్న ఇసుక లారీలు, ఇతర భారీ వాహనాలు ప్రతిరోజూ ఈ గుంతల్లో ఇరుక్కోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం ఏర్పడడంతో ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని వాహనదారులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ దిశగా ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టి సారిస్తుండడంతో త్వరలోనే ఈ రహదారికి మోక్షం కలుగుతుందని చర్చించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎచ్చెర్ల: చిలకపాలెం వద్ద జాతీయ రహదారి పై ఓవర్‌పై శనివారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో శ్రీకాకుళం నగరం మొండేటివీధికి చెందిన ఓడపల్లి చైతన్య (31) మృతిచెందాడు. గార మండలానికి చెందిన ఓ వ్యక్తితో చైతన్య శుక్రవారం మధ్యాహ్నం టాటా మ్యాజిక్ వ్యాన్‌పై మామిడి పండ్లు తీసుకువచ్చేందుకు తుని వెళ్లాడు. అయితే మామిడి పళ్లు లేకపోవడంతో తిరిగి ఇదే వాహనంపై వస్తుండగా.. చిలకపాలెం వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముందు సీటులో కూర్చొన్న చైతన్య తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. చైతన్యకు భార్య హేమలత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

శ్రీకాకుళం క్రైం: నగరంలోని మిల్లు జంక్షన్ వద్ద శనివారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదం లో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. గాశ్యామ్‌పాలెం గ్రామానికి చెందిన జగన్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తూ రోడ్డు ప్రమాదానికి గురైయ్యాడు. ఈ ప్రమాదంలో జగన్ తలకు గాయా లు కావడంతో రోడ్డుపై స్పృహకోల్పోయి పడి ఉన్నా డు. ఆదే సమయంలో ఆర్టీసీ ఉద్యోగి బాబ్జీ అటుగా రావడంతో రోడ్డు మీద గాయాలతో పడి ఉన్న జగన్ ను చూశాడు. అతడికి సపర్యలు చేస్తుండగా, జగన్ ఫోన్‌కు కాల్ రావడంతో వారికి జనిగిన విషయాన్ని వివరించాడు. దీంతో వారు అక్కడకు చేరుకుని ఆటోలో రిమ్స్‌కు తరలించారు. తలకు గాయం కావడంతో జగన్‌కు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

మహిళ అదృశ్యం

ఎచ్చెర్ల: కుశాలపురం పరిధిలోని యాతపేట గ్రామానికి చెందిన ఒనుము లక్ష్మీ ఈ నెల 25వ తేదీ నుంచి కనిపించడంలేదని ఆమె భర్త రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. లక్ష్మీ ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతసీతారాంపురంలో బాలిక..

ఎచ్చెర్ల: సంతసీతారాంపురం గ్రామానికి చెందిన బాలిక కంప తులసి(17) అదృశ్యమైనట్టు ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తులసి ఈ నెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వెళ్లలేదని తల్లి ముగతమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజీయే సరైన మార్గం



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయాధికారి

సోంపేట: రాజీయే సరైన మార్గమని సోంపేట కోర్టు ఒకటో బెంచ్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా కేసుల పరిష్కారం కోసం వచ్చిన కక్షిదారులతో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి, లోక్ అదాలత్ ప్రాధాన్యతను వివరించారు. కోర్టులో రెండు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఒకటో బెంచ్‌కు జె.శ్రీనివాసావు (సీనియర్ డివిజన్), రెండో బెంచ్‌కు సివిల్ న్యాయాధికారి (జూనియర్ డివిజన్) ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా 33 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి న్యాయవాదులు ఉషారాణి, సర్వేశ్వరావు, డి.జగన్నాథరావు, పున్నయ్య, రాజేశ్వరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న న్యాయాధికారి పరేష్‌కుమార్

ఇచ్ఛాపురం: జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని ఇచ్ఛాపురం మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి పి.పరేష్‌కుమార్ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో 35 పెండింగ్ కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, పట్టణ, రూరల్, కవిటి ఎస్‌ఐలు ఎస్‌ఐలు సత్యనారాయణ, లక్ష్మణరావు, రాము, న్యాయవాదులు అల్లాడ నారాయణరావు, గిన్ని సీతయ్యరెడ్డి, భగవాన్‌దాస్, బైరాగిరెడ్డి, రమణయ్యరెడ్డి, రాంబాబు, రంగారావు, మురళి, ఎన్‌వీఎస్ఆర్, తదితరులు పాల్గొన్నారు.

34 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారి జోత్స్న, న్యాయవాదులు

పొందూరు: జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం శనివారం పొందూరు కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.జ్యోత్స్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 34 కేసులకు పరిష్కారం చూపించారు. లోక్‌అదాలత్ ద్వారా ఇరువర్గాలకు సత్వర న్యాయం దొరుకుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.మంజుల, బ్రహ్మాజీ, కిరణ్, అశోక్, రామ్మోహన్, కృష్ణ, రాము తదితరులు పాల్గొని కేసుల పరిష్కారంలో సహకారం అందించారు.

తాగునీటి సమస్యపై నిలదీత

ఇచ్ఛాపురం: మున్సిపాల్టీ పరిధి 1, 2, 3 వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా ఎందుకు పూర్తి స్థాయిలో ట్యాంకర్ల ద్వారా నీరు అందించటం లేదని ఆ వార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, పత్రి తవిటయ్య అధికారులను నిలదీశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఎజెండాలో పొందిపరిచిన వివిధ అంశాలపై చర్చించారు. వర్షాకాలం వస్తుంది వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేయాలని కౌన్సిలర్లు కోరారు. వివిధ వార్డుల పరిధిలో కొళాయిల ద్వారా తాగునీరు రాకుండానే 42మంది లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని నోటీసులు ఇవ్వడం ఏంటని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. నీరు రాని వారి బిల్లులు రద్దు చేయాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి అధికారులకు సూచించారు. నీలకంఠేశ్వర వీధి డ్రైన్‌లో మట్టి పేరుకుపోవడంతో చిన్నపాటి వర్షానికే బురద రోడ్డుపైకి వస్తుంది. కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని 11వ వార్డు టీడీపీ కౌన్సిలర్ ఆశి లీలారాణి అధికారులను కోరారు. 4,5,6 వార్డుల పరిధిలో ఐరన్ విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని మార్చమని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోడం లేదని వార్డు కౌన్సిలర్లు పరపటి మంజు, శేఖర్ అధికారులను ప్రశ్నించారు. 4వ వార్డులో ఎటువంటి అభివృద్ధి జరగలేదని టీడీపీ కౌన్సిలరు గేదెల శేఖర్ అనడంతో వైస్ చైర్‌పర్సన్లు భారతి దివ్య, స్వర్ణమణి తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిసనర్ ఎన్.రమేష్ అధికారులు పాల్గొన్నారు.

డీలర్ వ్యవస్థకు పూర్వ వైభవం తేవాలి

పొందూరు: గతంలో వలే రేషన్ సరుకులు పంపిణీ చేసేలా డీలర్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర ఆర్‌టీఐ కో-కన్వీనర్ కిల్లి శ్రీరామమూర్తి కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో తీసుకువచ్చిన ఎండీఎల్ వ్యవస్థతో డీలర్ వ్యవస్థ నిర్వీర్యమైపోయిందన్నారు. సకాలంలో సరుకులు అందక కార్డుదారులు కూడా తీవ్రంగా ఇబ్బంది పడ్డారన్నారు. కేవలం ఒకటి, రెండు రోజులు మాత్రమే సరుకులు అందేవని ఆ రోజు లేని కార్డుదారులు రేషన్ కోల్పోయేవారన్నారు. అందువల్ల తక్షణమే టీడీపీ ప్రభుత్వం డీలర్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు.

రోడ్డు పనులు పూర్తి చేయించండి



చంద్రబాబుకు సమస్య వివరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస/పొందూరు: జిల్లాలో గత ఐదేళ్లుగా పూర్తి నిర్లక్ష్యానికి గురైన శ్రీకాకుళం-ఆమదాలవలస ప్రధాన రహదారి పనులు త్వరగా పూర్తి చేయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబును ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. శనివారం రాష్ట్ర రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా ఆయన కలిసి పరిస్థితి వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రభుత్వ పాలనలో శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారైందన్నారు. దీంతో శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల ప్రచారంలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తామని హామీ ఇచ్చామని, అందువల్ల నిర్మాణం పూర్తిచేసి మాటీ నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబుకు వివరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందిస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన జేసీఐ క్లబ్ సభ్యులు హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు అభినందనలు తెలిపారు శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వేచ్ఛావతి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలుపై వినతి పత్రాన్ని అందజేశారు. మున్సిపాల్టీలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే సయ్యద్‌ఖాన్ చెరువు బాగుచేయాలని, సాయంత్రం ఆరు గంటల తర్వాత ఇచ్ఛాపురం నుంచి వైజాగ్ వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు షన్ముఖరావు, నవీన్‌కుమార్, సభ్యులు డిల్లేష్, డాక్టర్ సంతోష్, రాజ్‌కుమార్, కాళ్ల జయదేవ్, రాము, శ్రావన్‌కుమార్, స్వరూప్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.


కేఆర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అరసవల్లి: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంఘ అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కమర్షియల్ టాక్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్‌ను వారంతా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అసోసియేషన్ విజయనగరం బ్రాంచ్ అధ్యక్షురాలు అలికాన రాజేశ్వరి, కార్యదర్శి టి.నిరంజన్ మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగానే కేఆర్‌పై అనేక తప్పుడు కేసులు పెట్టిందన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులపైనా, సంఘాల నేతలపైనా జరిపిన దాష్టీకాలపై విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. అక్రమ కేసులు బనాయించిన అధికారులను సస్పెండ్ చేయాలని, సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ సీఎస్ జవహర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యోగా సాధనతో అన్ని రుగ్మతలకు పరిష్కారం



యోగాపై పుస్తకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: యోగాతో అన్ని రుగ్మతలకు పరిష్కారం దొరుకుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగర కార్పొరేషన్ పరిధి పీఎన్ కాలనీలో గల యోగా సెంటర్‌లో మేడం నాగలక్ష్మి రచించిన యోగ పుస్తకాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నేటి ఆధునిక సమాజంలో అన్ని వయసుల వారు శారీరక, మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని, దీనికి పరిష్కారం ఒక్క యోగా మాత్రమేనన్నారు. మనసు, శరీరం రెండింటినీ సమన్వయం చేసి సమతుల్యతను సాధించడమే యోగా ప్రధాన లక్షణమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఆదిత్యాలయంలో ద్విశతావధానం



ద్విశతావధాన ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఆలయ అనివెట్టి మండపంలో శనివారం సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ద్వి శతావధాన కళా విలాసం అపర్ణ ప్రతిభ కిరణద్యోతకం' ఆహ్వాన పత్రికను ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సభ్యులు ఆవిష్కరించారు. జూలై 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సంస్థ కార్యదర్శి గుత్తు చిన్నారావు, ఉపాధ్యక్షుడు మండవిల్లి రవి, లీగల్ అడ్వైజర్ డి.పార్థసారథి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు, 21వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కాళ్ల జయదేవ్ అన్నారు. శనివారం వార్డు ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యదర్శి ప్రియాంక, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన తప్పనిసరి



సదస్సులో పాల్గొన్న పోలీసు అధికారులు



కొత్తచట్టాలను వివరిస్తున్న ప్రాసిక్యూటర్ శైలజ

శ్రీకాకుళం క్రైం: భారతీయ నూతన చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. సోమవారం నుంచి కొత్త చట్టాలు అమలులోకి రానున్నందున జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం రాత్రి పోలీసు అధికారులకు నూతన చట్టాలపై విశాఖ సిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ ఎం.శైలజ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చే కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ) చట్టాలపై వివరించారు. అధికారులు, సిబ్బంది కొత్త చట్టాలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు వైశ్రుతి, శివరామిరెడ్డి, శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వటవృక్ష పూజలు



వటవృక్షానికి పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలో సత్యసాయి వటవృక్ష పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు మాట్లాడుతూ.. 1959 జూన్ 29న భగవాన్ సత్యసాయి బాబా పుట్టపర్తిలో యూనివర్సిటీ రోడ్‌లో తన హస్త చాలనంతో తామ్రఫలకం సృష్టించి వటవృక్షాన్ని ప్రతిష్ఠించారన్నారు. అది బోధి వృక్షమని, జ్ఞాన వృక్షమని సాధువులకు అనుగ్రహాన్ని ప్రసాదించే సాధుకానుగ్రహ వటవృక్షమని బాబా చెప్పినట్టు ఆయన తెలిపారు. దాని నుంచి వచ్చిన విత్తనాలను మొక్కలుగా దేశ, విదేశాల్లో పెంచుతున్నట్టు తెలిపారు. ఈ పవిత్ర దినాన ఈ వృక్షాలు పెరిగే ప్రతి చోట ఒక ఆధ్యాత్మిక శోభతో పవిత్రంగా పూజలు హోమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వటవృక్షాల జిల్లా ఇన్‌చార్జి రమణ మూర్తి, బోయిన నర్సింహమూర్తి, పప్పల నాగేశ్వరరావు, మూర్తి మాస్టారు, ఆధ్యాత్మిక సమన్వయ కర్త అనాది గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఉమా జఠలేశ్వర స్వామికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరునికి ఆలయ అర్చకులు బి.అశ్వినీకుమార్ ఆధ్వర్యంలో క్రోధినామ సంవత్సరం జ్యేష్ఠ బహుళ అష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కలశాలతో ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి వార్షిక కల్యాణాన్ని చేపట్టారు. అధిక సంఖ్యలో భకులు పాల్గొన్నారు. మహేష్, శివ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేంకటేశ్వరస్వామికి..

ఇచ్ఛాపురం: బొడ్డబాళి గ్రామంలో వెలసివున్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువ జాము నుండే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు, తులసీమాలలు, పూలతో అలంకరించారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్దాల నిర్మలారెడ్డి, టీడీపీ నాయకులు మోహన్, మేరుగు సూర్యనారాయణ, నందికి జాని, డి.రామారావు, ఆశి మోహన్ స్వామివారిని దర్శించుకున్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

సరుబుజ్జిలి: చిన్న కాగితాపల్లిలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ నాయకులు గురువు తిరుమలరావు స్పష్టం చేశారు. శనివారం ఆయన ఆ పాఠశాల సందర్శించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తెలుగు పెంట గ్రామ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు నందివాడ గోవిందరావు, చిన్నకాగితాపల్లి మాజీ సర్పంచ్ వెలమల రమేష్ సహకారంతో యరగాం పంచాయతీ నుంచి తాను పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా పాఠశాలకు మంజూరైన నాడు-నేడు అభివృద్ధి పనులు అరాంతరంగ ఉండిపోవడంతో మరుగుదొడ్లు లేక బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మాణానికి వ్యక్తిగత నిధులతో పనులు ప్రారంభించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ సహకారంతో పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా అవసరమైన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు.

ఉద్యోగ విరమణ వృత్తికే.. శరీరానికి కాదు

శ్రీకాకుళంక్రైం: ఉద్యోగ విరమణ అనేది వృత్తికే కాని శరీరానికి కాదని, పదవి విరమణ అనంతరం ఆరోగ్యంగా ఆనందమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ జీఆర్ రాధిక ఉద్యోగ విరమణ పొందనున్న పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ నెల 30 ఉద్యోగ విరమణ చేయనున్న పోలీసు అధికారులు, సిబ్బందికి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్న ఎస్‌ఐలు ఎన్.కరయ్య, కె.మోహన్‌రావు, పి.డిల్లీశ్వరరావు, ఏఎస్ఐ బి.నాగభూషనరావు, ఏఆర్ ఎస్ఐ ఎన్ఎస్ పానిగ్రహి, హెచ్‌సీ బి.సంతోష్‌రావు, క్లాస్‌ఫోర్ ఉద్యోగి టి.రామారావులను ఎస్పీ రాధిక సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వరరావు, డీఎస్పీలు ఎ.త్రినాథరావు, ఎల్.శేషాద్రి, సీఐలు ఎం.అవతారం, సోమశేఖర్, బాబ్జీరావు,ఆర్ఐ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణకు చర్యలు

సరుబుజ్జిలి: ఐదేళ్ల లోపు వయసు ఉన్న చిన్నారులు డయేరియాతో మరణించడానికి వీలు లేకుండా జూలై 1 నుంచి ఆగస్టు చివరి వరకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని వైద్యాధికారులు ఎం.సంతోష్‌కుమార్, సాహితీ ప్రియదర్శిని తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షేత్రస్థాయి వైద్య సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో బాగంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఓఆర్ఎస్ స్వయంగా తయారీ, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత, తాగునీటి వనరులు తనిఖీలు చేయడం జరగాలని సూచించారు. సమావేశంలో సీహెచ్‌వో మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన మద్యం సరఫరా

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని బేవరేజస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఐఎంఎల్ డిపో నుంచి వైన్ షాపులకు మద్యం సరఫరా నిలిచిపోయింది. బాట్లింగ్ డిపో నుంచి వైన్‌షాపులకు మద్యం సరఫరా చేసే ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో నాలుగు రోజులుగా ఈ సమస్య ఎదురైంది. గత వైసీపీ ప్రభుత్వంలో బాట్లింగ్ డిపో నుంచి వైన్‌షాపులకు సరఫరా చేసేందుకు తమిళనాడుకు చెందిన ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు టెండర్ ఇచ్చింది. అయితే ఈ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ జిల్లాల వారీగా సబ్ కాంట్రాక్ట్ ఇచ్చి వైన్‌షాపులకు మద్యం సరఫరా చేసింది. డిపో నుంచి 20 కిలో మీటర్ల లోపునకు కిలోమీటరుకు రూ.12లు, 40 కిలోమీటర్లు లోపైతే రూ.14, 60 కిలో మీటర్లు లోపైతే రూ.18 స్లాబ్ లుగా నిర్ణయించి ట్రక్ యజమానులకు చెల్లిస్తున్నారు. కాగా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ రెండు నెలలుగా స్థానికంగా ఉన్న ట్రక్ యజమాలకు రవాణా ఛార్జీలు చెల్లించకపోవడంతో ఈ సమస్య వచ్చింది. దీంతో ట్రక్ యజమానులంతా వైన్‌షాపులకు మద్యం సరఫరా నిలిపి వేశారు. జిల్లాలో 193 వైన్ షాపులు, ఆరు మాల్స్‌కు ఈ పద్ధతిలోనే మద్యం సరఫరా అవుతుంది. అయితే నాలుగు రోజులుగా వైన్‌షాపులకు సరఫరా నిలిపేయడంతో అక్కడక్కడ షాపుల్లో నిల్వలు నిండుకున్న పరిస్థితి ఉంది. మద్యం ప్రియులు ఆశించిన మేరకు బ్రాండ్లు వైన్‌షాపుల్లో లభ్యమయ్యే పరిస్థితి లేదు. ఈ విషయమై డిపో మేనేజర్ సుబ్బారావు వద్ద ప్రస్తావించగా.. రాష్ట్రంలోని 28 డిపోల పరిధిలో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు.

జాబ్‌మేళాలో 83 మంది ఎంపిక

గుజరాతీపేట: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం జరిగిన జాబ్‌మేళాలో 83 మంది ఎంపికయ్యారు. జిల్లాలోని నలుమూలల నుంచి డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ డ్రైవ్‌కు అపోలా ఫార్మసీకు 458 మంది అభ్యర్థులు పాల్గొనగా, అందులో 55 మంది ఎంపికయ్యారు. పేటీఎంకు 35 మందికి గాను 12 మంది, నవత ట్రాన్స్‌పోర్టుకు 12 మందికి గాను ఐదుగురు, మూతూట్‌కు 15 మందికి గాను 11 మందిని ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర నారాయణ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పద్మావతి, జేకేసీ కో-ఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, అకడమిక్ కో.ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణలో భాగస్వాములు కావాలి

శ్రీకాకుళం క్రైం: నేర నియంత్రణలో ప్రజలు కూడా భాగస్వామ్యులు కావాలని శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో రాత్రి గస్తీ పటిష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐ సన్యాసినాయుడు రాత్రి గస్తీ విధులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ- ఊరెళ్లి ఇంటికి తాళాలు వేసే ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారన్నారు. అందువల్ల ఊరెళ్లేటప్పుడు సమీపంలోని పోలీసులకు సమాచారం అందిస్తే రక్షణ కల్పిస్తామన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మీ ప్రాంతంలో సంచరిస్తే 100కు తెలియజేయాలన్నారు.

డీఎస్ మృతికి సంతాపం

ఆమదాలవలస: ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి.శ్రీనివాస్ (డీఎస్) మృతికి పీసీసీ ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి సంతాపం వ్యక్తం చేశారు. శనివారం ఆమె తన స్వగృహంలో డీఎస్ చిత్రపటం ముందు నివాళులర్పించారు. సత్యవతి మాట్లాడుతూ 2004లో దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి మంత్రి వర్గంలో మంత్రిగా ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటి వద్దకే పింఛన్లు

జి.సిగడాం: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయనున్నట్టు మండల ప్రత్యేకాధికారి బి.ప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్లు పంపిణీలో సిబ్బంది అలసత్వం వహించకుండా ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పంపిణీ వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఆనందపురం, దవళపేట, పాలఖండ్యాం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీవో కె వెంకన్నబాబు, ఈవోఆర్డీ శ్రీనివాసులు, సర్పంచ్‌లు చిత్తిరి మంజు, దారబోయిన రెయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సోంపేట: ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ఎన్ఎఫ్ఏ గోవింద రెడ్డి అన్నారు. శనివారం సోంపేట డివిజన్ మండలం పలాసపురం యూనిట్ పాలవలస పంచాయతీ పరిధిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సంగారు పద్మ, సుందరమ్మ మహిళా రైతులకు సంబంధించిన రెండెకరాల జీడిమామిడి తోటల్లో పీఎండీఎస్ నవధాన్యాల సాగులో భాగంగా కందులు, రాగులు, గంటెలు, అలసందలు, గోరుచిక్కుడు, గోంగూర, జొన్నలు అంతర పంటలుగా వరుసలో వేయించారు. ఇలా సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం చేకూరడంతోపాటు నేల సారవంతంగా తయారవుతుందన్నారు. యూనిట్ ఇన్‌చార్జ్‌లు కుమారి, శివానంద, తులసయ్య, కామరాజు, చిట్టిబాబు, ఐసీఆర్‌పీలు శ్రావణి, ప్రవీణ, రైతులు పాల్గొన్నారు

విద్యార్థులకు కిట్లు అందజేత

ఇచ్ఛాపురం: మున్సిపాల్టీ పరిధిలో గల 1, 2, 3 వార్డుల పరిధిలో గల పలు ప్రభుత్వ పాఠశాలల్లో టీడీపీ వార్డు ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేశారు. ఏఎస్‌పేట, పురుషోత్తపురం, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు టెక్స్, నోట్ బుక్స్‌తో పాటు బ్యాగులను అందిజేశారు. కార్యక్రమంలో 3వ వార్డు టీడీపీ కౌన్సిలర్ పత్రి తవిటయ్య, టీడీపీ వార్డు ఇన్‌చార్జీలు గాలి పాపారావు, 2వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేంకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

జి.సిగడాం: సర్కారు బడులలో నాణ్యమైన విద్య లభిస్తుందని సర్పంచ్ కామోజుల ఆరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు బెవర లక్ష్మి అన్నారు. శనివారం మెట్టవలస ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో నాయలకులు కామోజుల సీతారాం, బెవర జగన్నాధరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

కంచిలి: రైతులకు అందుబాటులో విత్తనాలు ఉన్నాయని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బంగారు కురయ్య అన్నారు. శనివారం తలతంపర పంచాయతీలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదిన రామారావు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి మత్రిపాటి పూర్ణసర్పంచ్ జగబంధు, పైల రామారావు, శ్రీను, ఇందు, ఎస్ కామేష్ తదితరులు పాల్గొన్నారు.